క్లుప్తంగా

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: అక్టోబర్ 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం సాగునీరు, వ్యవసాయానికి కరెంట్, చింతలపూడి ఎత్తిపోతల పథకం వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు, సమస్యలపై పోరాటం చేసిందన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతోనే అభివృద్ధి

టి.నరసాపురం: వ్యవసాయంతోనే అభివృద్ధి ముడిపడి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యకాస నాయకురాలు బుద్ధుల గంగా భవాని అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా సహాయ కార్యదర్శి జి.వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ, టి.సత్యనారాయణ, గాంధీ, దుర్గమ్మ, చెల్లమ్మ, పద్మ, పాల్గొన్నారు.

సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు

కొయ్యలగూడెం: అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో బుధవారం సూపర్ సేవింగ్స్–సూపర్ జీఎస్టీ సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కేపీఎస్ పోశారావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన జీఎస్టీలో రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ పని ముట్లు, పాల ఉత్పత్తులపై 12 నుంచి 5 శాతం వరకు తగ్గించారని రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మోక్షం



ప్రసంగాలు చేస్తున్న పాస్టర్ రాజు

దెందులూరు: ప్రతి వ్యక్తి దేవునిపై ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తేనే మోక్షం లభిస్తుందని పాస్టర్ ఎస్.రాజు అన్నారు. మంగళవారం ఎస్ఎంఆర్ నగర్ ఎదుట హోలీ గ్రేస్ మందిరంలో ఉపవాస విజ్ఞాపన ఆరాధన పండుగలు నిర్వహించారు. పాస్టర్ రాజు ప్రసంగించారు. దెందులూరుతో పాటు సమీప మండలాల నుంచి వచ్చిన విశ్వాసులకు పాస్టర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

సంఘ అభివృద్ధికి కృషి

పెదవేగి: రైతులకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తినభ్య కమిటీ ఛైర్మన్ కొనకళ్ల శివమణి అన్నారు. మంగళవారం పెదవేగి మండలం ముండూరు సహకార పరపతి సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ లావాదేవీలు, అభివృద్ధి ప్రణాళికలు, రుణాల వివరాలను కార్యదర్శి ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ వితరణ



వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేస్తున్న పరమేష్

గణపవరం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సురక్షితమైన మంచి నీరు అందించడానికి నిడమర్రు మండల మానవత అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేష్ రూ.10 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. సోమవారం గణపవరంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ హసీనాకు అందచేశారు.

భవానీలకు అల్పాహారం అందజేత

దెందులూరు: జాతీయ రహదారి గుండుగొలను సింగవరం వద్ద గుండుగొలను గ్రామానికి చెందిన దాత ఇందుకూరి లక్ష్మీపతిరాజు, కుమారుడు రాము, సోమన్ వెంకటరావు ఆధ్వర్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి దసరా సందర్భంగా మాల ధరించి పాదయాత్రగా వెళుతున్న భవానీలకు 16 రకాల అల్పాహారాలతో పాటు భోజనం, తాగునీరు, మజ్జిగ అందించారు. కార్యక్రమంలో దాట్ల సీతారామరాజు, శ్రీనివాసరాజు, పట్నాల ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా భవానీ.. కరుణించవమ్మా!

- భవానీ దీక్షతో ఏకాగ్రత తథ్యం
- దేవీ నవరాత్రుల్లో ఏటా దుర్గమ్మ దీక్ష
- నానాటికీ పెరుగుతున్న మాలధారులు
- నియోజకవర్గంలో సుమారు 3 వేల మంది దీక్ష



బుట్టాయగూడెంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భవానీలు

బుట్టాయగూడెం: దసరా పండుగ వచ్చిందంటే దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇదే సమయంలో ప్రధాన ఆలయాల్లోనే కాకుండా వాడవాడలా దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అదే సమయంలో ప్రతి ఏటా భవానీ దీక్ష స్వీకరించి 11 రోజుల పాటు అత్యంత నిష్ఠతో అమ్మవారికి పూజలు చేస్తుంటారు. ఆడ, మగ, చిన్నాపెద్ద తేడా లేకుండా దీక్ష పూని పూజలు చేస్తుంటారు. అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది భవానీ దీక్ష దారుల సంఖ్య బాగా పెరిగినట్లు కనిపిస్తుంది. ప్రతీ గ్రామంలో వందల సంఖ్యలో భవానీలు కనిపిస్తున్నారు.

నియోజకవర్గంలో భవానీ దీక్షాధారులు 3 వేలకు పైనే

నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 3 వేల మందికి పైగానే భవానీలు దీక్షలు చేపట్టినట్లు తెలుస్తుంది. అయితే అత్యధికంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు కూడా ఈ మాలను ధరించడం విశేషం. కొందరు 9 రోజుల పాటు దీక్ష చేయగా మరి కొందరు 11 రోజుల పాటు దీక్షలు చేస్తున్నారు. భవానీ దీక్షలు ఎరుపు రంగు దుస్తులు, ఎర్రటి కండువా ధరిస్తూ కనిపిస్తున్నారు.

మొక్కు తీర్చుకోవడానికే దీక్ష



నేను బ్యాంక్‌లో రోజువారీ ఉద్యోగిగా పని చేస్తున్నాను. అది పర్మినెంట్ అయితే భవానీ దీక్ష ధరించి దుర్గమ్మను దర్శించుకుంటానని మొక్కుకున్నాను. అది నెరవేరింది. దీంతో 16 సంవత్సరాల నుంచి భవానీ మాల ధరిస్తూ దుర్గమ్మను దర్శించుకుంటున్నాను.

–నాగులపాటి బుచ్చమ్మ, బుట్టాయగూడెం

అమ్మవారికి సేవ చేసేందుకు దీక్ష



భవానీ మాతకు సేవ చేసేందుకు దీక్ష చేపట్టాను. నా వివాహం కోసం మా అమ్మ దుర్గమ్మను వేడుకుంది. అది తీరడంతో నేను దీక్ష చేపట్టి అమ్మవారి సేవలో ఉన్నాను. ప్రతి రోజూ పూజలు చేస్తున్నాను. 11వ రోజు దుర్గమ్మను దర్శించుకుంటాను.

–తాతినేని భానుభార్గవి, బుట్టాయగూడెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 1వ తేదీన ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి

బుట్టాయగూడెం: భూ అక్రమ లావాదేవీలపై చర్యలు తీసుకొని గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కారం గంగాధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయడం నిషేధం. అయినప్పటికీ కొంత మంది గిరిజనేతరులు మైదాన ప్రాంత గిరిజనులను బినామీలుగా పెట్టి అసైన్‌మెంట్, సీలింగ్ భూములు, గిరిజనేతర కబ్జాలో ఉన్న గిరిజనుల భూములను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపించారు.

గ్రామస్తుల సౌజన్యంతో రహదారి అభివృద్ధి



రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం సరిపల్లి రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్తుల సౌజన్యంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రోడ్డు పనులను మంగళవారం పొక్లెయినర్లతో ప్రారంభించారు. గ్రామస్తులు సమకూర్చిన రూ.1,50,000 నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులతో పాటు, దసరా రోజున మహిళా భక్తులు పది వేల మందికి పైగా బోనాలతో ర్యాలీ చేపట్టడానికి అనువుగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చింతలపూడి: నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్‌వీఎస్ నారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తుర్లపాటి బాబు మాట్లాడుతూ చింతలపూడి మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా మార్పు చెందినా కార్మికులకు జీతాలు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నాయకులు వి.పద్మ,నాగమణి, వంశీ, చిన్నయ్య, రాజీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అమ్మవార్ల దర్శనం

- ఆలయాల్లో భక్తుల కుంకుమ పూజలు
- క్షేత్రంలో వైభవంగా వాసవీమాత రథోత్సవం



జంగారెడ్డిగూడెం: దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ



జంగారెడ్డిగూడెం: దుర్గాదేవిగా నూకాలమ్మ



కొయ్యలగూడెం: దుర్గాదేవిగా అమ్మవారు



పోలవరం రూరల్: ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



ద్వారకాతిరుమల: దుర్గాదేవిగా కుంకుళ్లమ్మ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వెలసిన గ్రామ దేవత గంగానమ్మ దసరా ఉత్సవాలు తొమ్మిదో రోజు అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లి రాంబాబు, వరలక్ష్మి దంపతులు 120 గ్రాముల వెండి దర్బ అమ్మవారికి సమర్పించారు. ప్రధాన పూజలో కాశీరాజు, నడిపల్లి సతీష్, పసుమర్తి సాయి కుమార్ దంపతులు పాల్గొన్నారు. దుర్గాదేవిగా నూకాలమ్మ భక్తులతో పూజలందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) సారథ్యంలో వైస్ చైర్మన్ రొంగల నాగేశ్వరావు, కమిటీ సభ్యులు, నూకాంబికా సేవా బృందం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ కల్యాణ వేదికపై లక్ష పుష్పార్చన ప్రధానార్చకులు కాళ్లకూరి శంకర్ మహేష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో దుర్గాష్టమిని పురస్కరించుకుని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. దేవాలయం ప్రధానార్చకులు ఆదిత్య మిశ్ర అర్చకత్వంలో పగడాలు, ఎర్రని పువ్వులతో దుర్గామాత రూపంలోని ముత్యాలమ్మ అమ్మవారు అర్చన అందుకున్నారు. జంగారెడ్డిగూడెం వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు 22వ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణకు కోప్పరపు శ్రీరామమూర్తి దంపతులు చీర, కొనకళ్ల అభిరాం, బాల శ్రావణి, తులసి రాణి ప్రసాదం సమర్పించారు. ప్రధాన పూజలో కొండా కాళిదాసు పద్మ కృష్ణారావు, కుసుమాంబ దంపతులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: దుష్టశిక్షణ, శిష్టరక్షణకు అవతరించిన శ్రీ దుర్గాదేవి అలంకారంలో క్షేత్రదేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

క్షేత్రంలో వాసవీమాత రథోత్సవం

శ్రీవారి క్షేత్రంలో వాసవీమాత దివ్య రథోత్సవం మంగళవారం సాయంత్రం నేత్ర పర్వంగా నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ రథోత్సవాన్ని ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు నిర్వాహకులు అట్టహాసంగా నిర్వహించారు. రథోత్సవంలో కోలాట నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం కల్యాణ మండప ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అమ్మవారు

పోలవరం రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజైన మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణ చేపట్టారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

దుర్గాదేవిగా కనకదుర్గమ్మ

టి.నరసాపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. టి.నరసాపురం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బోనాల కార్యక్రమం మహా నైవేద్యం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించారు. మండలంలోని టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర ఆలయం, గీతా మందిరం, గండిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజు, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎలమర్తి వెంకటేశ్వరరావు, గన్నిన ఉమా మహేశ్వరరావు, దుర్గారావు, పుల్లయ్య, నందికొండ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాకాళిగా కనకదుర్గమ్మ

వైభవంగా లక్ష కుంకుమార్చన పూజలు

కొయ్యలగూడెం: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం కనకదుర్గమ్మ మహాకాళి అలంకరణతో పూజలందుకున్నారు. రాజవరంలో దసరా సందర్భంగా ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మకు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, విష్ణుమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి, బయ్యనగూడెం కనకదుర్గమ్మ కాళికాదేవిగా, వై.జంక్షన్, కన్నాపురంలోని కనకదుర్గమ్మ దుర్గాదేవిగా పూజలందుకున్నారు. వై.జంక్షన్ ఆలయ ప్రాంగణంలో సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించారు. కొయ్యలగూడెం కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం చండీహోమం సాయంత్రం నుంచి చింతాలమ్మ ఆలయం వద్ద నిర్మించిన కోనేటిలో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. గవరవరంలోని రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో మహిళలు పూజలు నిర్వహించారు.



కొయ్యలగూడెం: లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు




టి.నరసాపురం: బోనాలు తీసుకెళుతున్న భక్తులు



ద్వారకాతిరుమల: కోలాట నృత్యాలు చేస్తున్న భక్తులు

వినీలాకాశపు ఇంద్ర ధనస్సు



కొయ్యలగూడెంలో కనువిందు చేసిన ఇంద్ర ధనస్సు

వినీలాకాశపు ఇంద్ర ధనస్సు కొయ్యలగూడెం పట్టణవాసులను కనువిందు చేసింది. మంగళవారం సాయంత్రం తుఫాను నేపథ్యంలో కురిసిన చిరు జల్లులకు సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఆకాశంలో ఇంద్ర ధనస్సు విరిసింది. సప్త వర్ణాల శోభితంతో ఇంద్ర ధనస్సు రంగులు వెదజల్లగా వినీలాకాశంలో నల్లని కారుమబ్బులుగా మారే మేఘాలు కొద్దిసేపు నీలవర్ణ శోభితంతో ఆకర్షించాయి.

–కొయ్యలగూడెం

చెరువును తలపిస్తున్న రహదారి



రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

చింతలపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు చింతలపూడి మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రహదారులు ధ్వంసమయ్యాయి. చింతలపూడి, సత్తుపల్లి, చింతలపూడి, గురుభట్లగూడెం ప్రధాన రహదారులు పలుచోట్ల గోతులు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి ఏటా వర్షా కాలంలో రోడ్లు దెబ్బతినడం, వాటిని తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు వేసిన కొద్ది కాలానికే కొట్టుకుపోతున్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం కారణంగా వేసిన కొద్ది కాలానికే శిథిలమవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఏటా మరమ్మతుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షం పడిందంటే రోడ్లు మురికి గుంటలుగా మారుతున్నాయి. వర్షపు నీటితో నిండిన గుంతలు కనపడక వాహనదారులు వీటి బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మధ్య తెలంగాణ నుంచి భారీ వాహనాలు తిరుగుతుండటంతో అధిక బరువు వలన కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులు పాడవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురవ్వడంతో సరైన డ్రెయినేజీ సౌకర్యాలు లేక వర్షపు నీటితో పాటు ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్లపైకి చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం రహదారుల మరమ్మతులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తక్షణం మరమ్మతులు చేపట్టాలి



దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు తక్షణం చేపట్టాలి. రహదారులకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వతంగా రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించాలి. చింతలపూడి పట్టణంలో పక్కా డ్రెయిన్లు నిర్మించాలి. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారుల పైకి మురుగు నీరు చేరుతుంది.

–బి.చెంచమరాజు, బీసీ నాయకుడు

భానుడి ప్రకోపానికి భక్తులు విలవిల



శ్రీవారి కొండపైచెట్టు నీడలో సేదతీరుతున్న భవానీ దీక్షాధారులు



చీర చెంగు కప్పుకున్న భక్తురాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి భక్తులు భానుడి ప్రకోపానికి భక్తులు విలవిలలాడారు. కొందరు మహిళా భక్తులు తలలపై చీర చెంగులు కప్పుకోగా, యువతులు చున్నీలను కప్పుకుని ఆలయ పరిసరాల్లో సంచరించారు. సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్ వద్ద క్యూ కట్టిన భక్తులు తలలకు టోపీలు పెట్టుకోవడం, తుండ్లు, కర్చీఫ్‌లు కప్పుకోవడం వంటివి చేశారు. భవానీ దీక్షాధారులు చెట్లు కనిపిస్తే చాలు, వాటి కిందకు చేరి సేదతీరారు. జోరున వర్షం, లేదంటే భానుడి భగభగలు. గత కొద్ది రోజులుగా ఈ వింత వాతావరణంతో అటు ప్రజలు, ఇటు క్షేత్రానికి వచ్చే భక్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రహదారిపై మెటల్‌తో ప్రమాదాలు

భీమడోలు: జాతీయ రహదారిని ఆనుకుని గుండుగొలను గోదావరి కాలువపై నిర్మించిన వంతెన వద్ద పరిచిన చిన్న మెటల్, రాళ్లు సర్దకపోవడంతో ప్రమాదానికి నెలవుగా మారాయి. వంతెన అంచుల వెంబడి ఎక్కే తరుణంలోనూ, గ్రామం నుంచి రోడ్డు పైకి వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్య రాత్రి వేళల్లో మరింత ఎక్కువగా ఉండడంతో వాహనదారులు భయపడిపోతున్నారు. వాస్తవానికి ఈ వంతెన నిర్మాణాన్ని తుది దశలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవతో పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వంతెనకు ఇరువైపులా రోడ్డు పటిష్టత కోసం అంచుల వెంబడి వేసిన చిన్న మెటల్‌ను సర్దకపోవడంతో తరుచూ వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వంతెనపై నుంచి భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, ఇతర ప్రాంతాలకు ప్రతి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించడంతో అదమరిస్తే ప్రమాదం పొంచి ఉంటుందని వాపోతున్నారు. ఈ రోడ్డుపై ఏదైనా వాహనం జారితే వెనుక నుంచి వచ్చే భారీ వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనకు ఇరువైపులా పక్కా రోడ్డు వేయాలని వారు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఆ మెటల్ సర్ది, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.